సాక్షి రంగారెడ్డి

గురువారం । 12 । జూన్ । 2025



బీజేపీ బలోపేతానికి..

బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. 8లో▸



కేసారం ఓటర్లను..

కేసారం వార్డులోని ఓటర్లను చేవెళ్ల వార్డు ఓటర్లతోనే కలపాలని ఎమ్మెల్యే కాలె యాదయ్యకు వినతిపత్రం అందజేశారు. 8లో▸



నిరంతర పోరాటం

బీసీల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తామని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణయాదవ్ పేర్కొన్నారు. 8లో▸

● బడికి రెడీ



వేసవి సెలవులు ముగిశాయి. ఆటపాటలకు టాటా చెప్పి విద్యార్థులు బడిబాట పట్టే సమయం ఆసన్నమైంది. గురువారం పాఠశాలల గేట్లు తెరుచుకోనున్నాయి. ఈ మేరకు బుధవారం పలు స్కూళ్లను ప్రారంభానికి సిద్ధం చేశారు. పిచ్చిమొక్కలను తొలగించి తరగతి గదులను శుభ్రం చేశారు. మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో సిబ్బంది ఇలా తరగతి గదులను శుభ్రం చేస్తూ కనిపించారు.

– మొయినాబాద్ రూరల్

● అంగన్‌వాడీకి రండి



తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించాలని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'అమ్మమాట–అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ రెండున్నరేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీకి పంపించాలని కోరుతున్నారు. కద్లాల్‌లో బుధవారం ఇలా అంగన్‌వాడీ సిబ్బంది ర్యాలీ ద్వారా ప్రచారం సాగిస్తూ కనిపించారు.

– కద్లాల్

● ఏరువాక బండి



ఏరువాక పౌర్ణమి వేడుకలను బుధవారం రైతులు అంగరంగ వైభవంగా జరుపుకొన్నారు. తమ కాడెద్దులను, బండ్లను అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాల్లోని ప్రధాన వీధులు, ఆలయాల చుట్టూ ఊరేగింపు చేపట్టారు. పంటలు బాగా పండి సుఖ సంతోషాలతో ఉండే విధంగా చూడాలని వేడుకున్నారు. షాబాద్ మండలం కుర్వగూడలో గ్రామస్తులు ఇలా ఎడ్లబండ్ల ర్యాలీ నిర్వహించారు.

– షాబాద్

న్యూస్‌రీల్

బస్ చార్జీలను తగ్గించండి



సమావేశంలో మాట్లాడుతున్న మాధవ రెడ్డి

తుర్కయంజాల్: పెంచిన ఆర్టీసీ బస్ చార్జీలను వెంటనే తగ్గించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి డిమాండ్ చేశారు. తుర్కయంజాల్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ.. పెంచిన చార్జీలతో పేద ప్రజలు, విద్యార్థులకు ఆర్థిక భారం కానుందన్నారు. చార్జీల పెంపును వెనక్కి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.జగన్ మోహన్ రెడ్డి, టి.బాలయ్య, బీరప్ప, గంధం బాలరాజ్, నరేందర్, కాటమయ్య, రేఖ, అండాలు, సావిత్రి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో ఫెన్సింగ్ తొలగింపు



కేశంపేట: మండల పరిధిలోని చింతకుంటపల్లిలో ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని గ్రామస్తులు నాయబ్ తహసీల్దార్ గీతకు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వేనంబర్ 98లో మూడు ఎకరాల ప్రభుత్వ భూమికి కొందరు ఫెన్సింగ్ వేసినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఆర్‌ఐ చెన్నకేశవులు ఫెన్సింగ్ వేసి భూమిని పరిశీలించారు. ప్రభుత్వ భూమిలో పాతిన కడీలను తొలగించారు.

నేడు డయల్ యువర్ డీఎం

షాద్‌నగర్: ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకునేందుకు గురువారం డయల్ యువర్ డీఎం నిర్వహించనున్నట్టు షాద్‌నగర్ డిపో మేనేజర్ ఉష బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలు, సలహాలు తెలియజేయాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 99592 26 287 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సంక్షేమ నిధి ఏర్పాటు హర్షణీయం

మొయినాబాద్: దేవాలయాల్లో పనిచేసే అర్చకులు, ఇతర ఉద్యోగులకు లబ్ధి చేకూరేవిధంగా ప్రభుత్వం ప్రత్యేకంగా సంక్షేమ నిధిని ఏర్పాటు చేయడంపై దేవాలయాల పరిరక్షణ ఉద్యమం కన్వీనర్, చిలుకూరు బాలాజీ దేవాలయం వంశపారంపర్య అర్చకుడు రంగారజన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 17 ఏళ్లకుపైగా అపరిష్కృతంగా ఉన్న సమస్యను పరిష్కరించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. 1997లో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లోనే ఈ నిధి ఏర్పడినా పూర్తిస్థాయిలో అమలు కాలేదన్నారు. 2014లో రాష్ట్ర విభజన జరిగిన నాటి నుంచి పూర్తిస్థాయి సంక్షేమ నిధి ఏర్పాటు అంశం పెండింగ్‌లోనే ఉందన్నారు. సంక్షేమ నిధి ఏర్పాటుపై సోమవారం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రకటన చేశారని.. దానికి సంబంధించిన పోస్టర్ విడుదల చేశారన్నారు. ఈ నిధి ఏర్పాటుతో చిన్నస్థాయి నుంచి అసిస్టెంట్ కమిషనర్ స్థాయి వరకు 13,700 మంది అర్చకులు, ఇతర సిబ్బందికి ప్రయోజనం చేకూరుతుందన్నారు.

బ్యాలెన్స్ తప్పిన బడి బడ్జెట్



జూన్‌లో అమాంతం పెరిగిన ఖర్చు

- సర్దుబాటు చేయలేక తల్లిదండ్రుల పాట్లు
- అప్పు చేసి మరీ ఫీజుల చెల్లింపు, స్టేషనరీ కొనుగోలు
- ముగిసిన వేసవి సెలవులు
- నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: విజ్ఞానాన్ని పంచాల్సిన విద్యా సంస్థలు ఫక్తు వ్యాపార కేంద్రాలుగా మారాయి. తమ పిల్లలను మంచి స్కూల్లో చేర్పించి, మంచి విద్యను అందించి, వారిని తమకంటే ఉన్నతులుగా తీర్చిదిద్దాలనే తల్లిదండ్రుల్లో ఉన్న బలహీనతను 'క్యాష్' చేసుకుంటున్నాయి. నిర్వహణ ఖర్చు, ఉపాధ్యాయుల వేతనాల పేరుతో ఏటా ట్యూషన్ ఫీజు పది నుంచి 25 శాతం పెంచేసి, ముక్కు పిండి మరీ వసూలు చేస్తున్నాయి. ఎవరికి వారు ప్రత్యేక వర్క్‌షీట్స్, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, డ్రెస్సులు, డైరీలు, టైలు, బెల్ట్స్ తయారు చేసి పాఠశాలకు సమీపంలోనే ప్రత్యేక కౌంటర్లు తెరిచి మరీ విక్రయిస్తున్నాయి. ట్యూషన్ ఫీజు, స్టేషనరీ ధరలపై నియంత్రణ లేకపోవడంతో ఇష్టారీతిన వసూలు చేస్తున్నాయి. ఎవరైనా తల్లిదండ్రులు ఇదేమిటని ప్రశ్నిస్తే అదంతే అని నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నాయి. ఆర్థిక స్థోమత లేకపోయినా పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అప్పు చేసైనా కట్టాల్సి వస్తోంది. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు 3,203 వరకు ఉన్నాయి. వీటిలో 9,50,079 మంది విద్యార్థులు చదువుతున్నట్లు అంచనా. ప్రైవేటు పాఠశాలల్లో తమ పిల్లలను చదిస్తున్న తల్లిదండ్రులు ఖర్చుల విషయంలో బడ్జెట్ పద్మనాభంలా ఆచితూచి వ్యవహరించాల్సి వస్తోంది.

'శంషాబాద్‌కు చెందిన సత్యనారాయణ ఓ ప్రైవేటు సంస్థలో పని చేస్తున్నాడు. నెలసరి వేతనం రూ.25,000కు మించి లేదు. ఆయనకు ఇద్దరు పిల్లలు. స్థానికంగా ఉన్న ఓ సాధారణ బడ్జెట్ స్కూల్లో వారిని చదివిస్తున్నాడు. కుమారుడు పదో తరగతి, కుమార్తె ఏడో తరగతి చదువుతున్నారు. పాఠశాలలు పునఃప్రారంభం కానుండడంతో పాఠ్యపుస్తకాలు, వర్క్‌షీట్స్, నోట్ బుక్స్, బ్యాగు, లంచ్‌బాక్స్, స్టేషనరీ, రెండు జతల షూ, సాక్స్, రెండు జతల డ్రెస్సుల కోసం రూ.12,000 వరకు వెచ్చించాడు. ఇక స్కూలు వ్యాన్ అడ్వాన్స్ ఫీజు రూ.2,500, మొదటి విడత ట్యూషన్ ఫీజు రూ.15,000 చెల్లించాల్సి వచ్చింది. ఇంటి అద్దె రూ.8,000, నిత్యావసరాలకు రూ.6,000 పోయాయి. జూన్‌లో వచ్చిన జీతంతో పోలిస్తే.. రెండు రెట్లు అదనంగా ఖర్చు భరించాల్సి వచ్చింది'.

'మీర్‌పేటకు చెందిన రాజేందర్‌రెడ్డి కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. ఇంటిలోను, ఇతర కటింగ్స్ పోను చేతికి నెలకు రూ.35 వేలు అందుతుంది. ఒక్కగానొక్క కుమార్తెను స్థానికంగా ఉన్న ఓ కార్పొరేట్ పాఠశాలలో చేర్పించాడు. పాఠశాలల పునఃప్రారంభానికి ముందే ట్యూషన్ ఫీజు ఫస్ట్ టర్మ్ కింద రూ.25 వేలు చెల్లించాడు. రెండు జతల యూనిఫామ్స్ కోసం రూ.3,000, స్కూలు బస్సుకు అడ్వాన్స్ ఫీజు రూ.5,000 కట్టేశాడు. ఇక ప్రైవేటు వర్క్‌షీట్స్, ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, రెండు జతల షూ, టై, బెల్ట్ కోసం రూ.12,000 వెచ్చించాడు. నెలవారీ సంపాదన కంటే అధికంగా ఖర్చు కావడంతో విధిలేని పరిస్థితుల్లో తోటి ఉద్యోగి వద్ద అప్పు చేయాల్సి వచ్చింది'.

'మహబూబ్‌నగర్‌కు చెందిన వెంకటేశ్ బతుకుదెరువు కోసం నగరానికి వచ్చాడు. హయత్‌నగర్‌లో ఇల్లు అద్దెకు తీసుకుని ఆటో నడుపుతున్నాడు. రోజుకు రూ.500 నుంచి రూ.800వరకు గిట్టుబాటవుతుంది. నెలకు సగటున రూ.20 వేలకు మించదు. ఇద్దరు కుమారులను బాగా చదివించాలన్న ఆశతో ఓ ప్రైవేటు పాఠశాలలో చేర్పించాడు. అప్పు చేసి మరీ పుస్తకాలు, టై, బెల్ట్, షూ, డ్రెస్సులు కొనిచ్చాడు. పిల్లల ఖర్చుతో ఈ నెల ఇంటి అద్దె చెల్లించలేకపోయాడు'.

ఫీజులు నియంత్రించాలి



మాకు ఒక పాప. ఎల్‌కేజీ చదువుతోంది. భర్త ప్రైవేటు ఉద్యోగం చేస్తాడు. గత నెల కుటుంబ అవసరాలకు రూ.20 వేల వరకు ఖర్చు వచ్చింది. ఉన్నంతలో నెట్టుకొస్తున్నాం. ఈనెల పాప వర్ణిక చదువు కోసం రూ.15వేల నుంచి రూ.20 వేలు అదన భారం పడుతోంది. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజలపై నియంత్రణ ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– కల్యాణి, జల్‌పల్లి

అదనపు భారం



ప్రైవేటు జాబ్ చేస్తున్నాను. జీతం నెలకు రూ.15 వేలు. పెద్ద కూతురు ప్రైవేటులో ఐదో తరగతి చదువుతోంది. స్కూల్‌ఫీజు రూ.30 వేలు. చిన్న కూతురును ఈ సారి స్కూల్లో చేర్పించడానికి అడ్మిషన్ ఫీజే రూ.5 వేలు అడుగుతున్నారు. ఇద్దరికీ పుస్తకాలు, యూనిఫాం, బ్యాగులు, షూ కొనడానికి రూ.20 వేలు అవుతోంది. ఈ నెల అదనపు భారం పడుతోంది.

– పానగారి కుమార్, కనకమామిడి, మొయినాబాద్



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

అన్యాయంగా భూములు లాక్కోవద్దు

తుక్కుగూడ: అన్యాయంగా తమ భూములు లాక్కోవద్దని మున్సిపల్ పరిధిలోని రావిర్యాలకు చెందిన పలువురు దళితులు వాపోయారు. మున్సిపల్ పరిధిలోని రావిర్యాలకు చెందిన దళితులు కొంగర ఖుర్దు ఏ సర్వే నంబర్ 73లోని 42 ఎకరాల 36 గంటల అసైన్డ్ భూమిని సాగు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ఈ భూమిపై సుమారు 100 కుటుంబాలు ఆధారపడ్డాయి. సదరు భూమిని ప్రభుత్వం తమకి కేటాయించిందని తెలంగాణ హౌసింగ్ బోర్డ్ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకోవడానికి పోలీస్ బందోబస్తుతో వచ్చారు. జేసీబీలతో చదును చేయించి చుట్టూ కంచె వేసేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న రైతులు కుటుంబ సభ్యులతో కలిసి భూమి వద్దకు చేరుకున్నారు. అక్కడే కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో హౌసింగ్ బోర్డ్ అధికారులు, రైతులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తమకి ప్రభుత్వం ఎలాంటి నోటీసులు గానీ, సమాచారంగానీ లేకుండా భూమిని తీసుకోవడం అన్యాయమని రైతులు పేర్కొన్నారు. 1952 నుంచి సాగు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నామని తెలిపారు. ఇప్పటికే ఈ భూమి నుంచి గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఏర్పాటుకు మార్కింగ్ చేశారన్నారు. తమ భూములను తీసుకొని అన్యాయం చేయొద్దని ఆందోళన చేశారు.

దళిత భూముల జోలికి రావద్దు

సమాచారం అందుకున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అక్కడికి చేరుకున్నారు. రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. హౌసింగ్ బోర్డ్ అధికారులు, పోలీసులతో మాట్లాడారు. దళిత రైతులకు సమాచారం ఇవ్వకుండా వారి భూములను స్వాధీనం చేసుకోవడం తగదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు దళిత భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు పాల్గొన్నారు.

రాజకీయ చైతన్యంతోనే అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న రాగల్ల ఉపేందర్

షాద్‌నగర్‌రూరల్: దళితులు రాజకీయంగా చైతన్యవంతులు అయినప్పుడే అభివృద్ధి సాధ్యమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రాగల్ల ఉపేందర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కిషన్‌నగర్‌లో బుధవారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నాగభూషణం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ.. దళిత రిజర్వేషన్‌కోసం 31 సంవత్సరాలుగా ఎమ్మార్పీఎస్ అలుపెరగని ఉద్యమం చేసిందని చెప్పారు. దశాబ్దాల ఉద్యమం తరువాత వర్గీకరణ సాధించుకోవడం జరిగిందన్నారు. భవిష్యత్‌లో దళితులంతా ఐకమత్యంతో ఏకతాటిపైకివచ్చి రిజర్వేషన్ వర్గీకరణ ఫలాలను అందుకోవాలన్నారు. జూలై 7న నిర్వహించనున్న జెండావిష్కరణ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఘువరన్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ, నాయకులు పాండు, కృష్ణ, లింగం, ప్రవీణ్, శ్రీశైలం, బాలు తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య



మైత్రి (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: కడుపునొప్పి, చెవి నొప్పి భరించలేక ఓ బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఆదిబట్ల మున్సిపాలిటీ ఎంపీపటేల్‌గూడకు చెందిన గడుసు మైత్రి (20) ఇబ్రహీంపట్నంలోని గురునానక్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఇటీవల తీవ్రమైన కడుపునొప్పి, చెవినొప్పితో బాధపడుతోంది. సరైన చికిత్స అందడం లేదని మనస్తాపానికి గురై బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నాలా ఆక్రమణల తొలగింపు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో నాలా విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. బుధవారం చింతలబస్తీలో నాలా ఆక్రమణలను హైడ్రా తొలగించింది. బంజారాహిల్స్ రోడ్ నెం.12 వద్ద ఉన్న కల్వర్టుకు చింతలబస్తీ వైపు ఆక్రమణలు జరిగాయి. ఈ కల్వర్టుకు ఓవైపు 15 మీటర్ల వెడల్పుతో నాలా ఉండగా... చింతలబస్తీ వైపు 7 మీటర్ల మేర కబ్జా జరిగినట్టు నిర్ధారించిన అధికారులు ఆ ఆక్రమణలను తొలగించారు. ఇసుక, చిన్న సిమెంట్ దుకాణంతో పాటు కల్లు కాంపౌండ్ రేకుల షెడ్డు కూల్చేశారు. పింఛన్ ఆఫీసు వద్ద ఉన్న కల్వర్టును పూర్తి స్థాయిలో విస్తరించనున్నారు. శంకర్‌పల్లిలోని బుల్కాపూర్ చెరువు నుంచి మొదలైన ఈ నాలా నాగులపల్లి, పుప్పాలగూడ, మణికొండ, దర్గా, మెహిదీపట్నం, బంజారాహిల్స్ రోడ్ నెం.12, చింతలబస్తీ, తుమ్మలబస్తీ, హుస్సేన్‌సాగర్ మీదుగా వెళ్లే ఈ నాలా ద్వారా నీరు సాఫీగా సాగేందుకు హైడ్రా చర్యలు తీసుకుంటోంది.

సాగర్ రోడ్డుపై ఘోర ప్రమాదం

కారును ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

- అక్కడికక్కడే ముగ్గురు యువకుల మృతి
- మరో నలుగురికి తీవ్ర గాయాలు
- బర్త్ డే వేడుకలు చేసుకుని తిరిగి వస్తుండగా ప్రమాదం
- మృతులు, క్షతగాత్రులంతా సమీప బంధువులే





ప్రమాదానికి కారణమైన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, నుజ్జునుజ్జయిన కారు

యాచారం: నాగార్జునసాగర్– హైదరాబాద్ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి ఒంటిగంటకు ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతి వేగంగా వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఎదురుగా వస్తున్న కియా కారును ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతిచెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం, గుడిబండ గ్రామానికి చెందిన వాస సాయితేజ(24), వాస రాఘవేంద్ర(22), వాస పవన్‌కుమార్(26), వాస శివకుమార్, వాస సాయికుమార్(ఇద్దరు అన్నదమ్ములు), ఇదే జిల్లా మూసాపేట మండల కేంద్రానికి చెందిన మేకల సందీప్ సమీప బంధువులు. వీరంతా హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో ఉంటూ ప్రైవేటు ఉద్యోగాలు చేసుకుంటున్నారు. మంగళవారం వాస శివకుమార్ పుట్టిన రోజు కావడంతో బీఎన్‌రెడ్డి నగర్‌కు చెందిన స్నేహితుడు శివకుమార్ గౌడ్‌తో కలిసి..ఉదయం నల్గొండ జిల్లా దేవరకొండ సమీపంలోని వైజాగ్ కాలనీకి వెళ్లారు. అక్కడ సంబరాలు ముగించుకుని మంగళవారం రాత్రి 11.30 గంటల సమయంలో తిరిగి హైదరాబాద్ బయల్దేరారు. మాల్ సమీపంలోకి రాగానే నగరం నుంచి దేవరకొండ వైపు వెళ్తున్న ట్రావెల్స్ బస్సు వీరి కారును ఢీకొట్టింది. ఈ సంఘటనలో సాయితేజ, రాఘవేంద్ర, పవన్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందారు. శివకుమార్, సాయికుమార్, శివకుమార్ గౌడ్, సందీప్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అక్కడికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను మాల్, మన్నెగూడలోని ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించారు. పార్టీకి వెళ్లిన వారిలో పవన్‌కుమార్ ఒక్కడికే వివాహం జరిగింది. ఇతనికి భార్య వరలక్ష్మి, ఒక కూతురు ఉన్నారు. ప్రస్తుతం వరలక్ష్మి నాలుగు నెలల గర్భిణి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.



మృతులు పవన్‌కుమార్, సాయితేజ, రాఘవేంద్ర

సాగర్ రోడ్డుపై ట్రాఫిక్ జామ్

సాగర్ రోడ్డుపై జరిగిన ప్రమాదంతో గంటపాటు ట్రాఫిక్ జామ్ అయింది. సమాచారం అందుకున్న యాచారం పోలీసులు అక్కడికి చేరుకుని కారులో ఇరుక్కుపోయిన మృతదేహాలను అతికష్టం మీద బయటకు తీశారు. ట్రావెల్స్ బస్సు, కారును ఢీకొన్న సమయంలో భారీ శబ్దం వచ్చిందని గ్రామస్తులు తెలిపారు. అతివేగం కారణంగానే ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉందని తెలిపారు.

కేసారం ఓటర్లను చేవెళ్ల వార్డులోకే కలపాలి


ఎమ్మెల్యే కాలె యాదయ్యకు వినతిపత్రం అందిస్తున్న కేసారం గ్రామప్రజలు

చేవెళ్ల: మున్సిపాలిటీ పరిధిలో వార్డుల విభజనలో కేసారం వార్డులోని ఓటర్లను చేవెళ్ల వార్డు ఓటర్లతోనే కలపాలని ఎమ్మెల్యే కాలె యాదయ్యకు ఆ వార్డు ప్రజలు వినతి ప్రతం అందజేశారు. బుధవారం మాజీ సర్పంచ్ రమేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రజలు, నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాము ఎన్నో ఏళ్లుగా చేవెళ్ల పంచాయతీలో అనుబంధ గ్రామంగా కొనసాగామని, ఇప్పుడు మున్సిపాలిటీలో కూడా చేవెళ్ల వార్డులోనే తమ ఓట్లు ఉండాలని కోరారు. కేసారంలో 889 ఓట్లు ఉండగా మరో 600ల ఓట్లు మల్కాపూర్ నుంచి కలిపి కేసారం వార్డుగా ప్రకటించారన్నారు. తక్కువగా ఉన్న ఓట్లను మల్కాపూర్‌తో కాకుండా చేవెళ్లలోని ఓట్లతో కలిపి చేవెళ్ల వార్డులోనే కలిసి ఉండేలా చూడాలని కోరారు. చేవెళ్లతో 70 ఏళ్లుగా అనుబంధం ఉందని కేసారం గ్రామ పంచాయతీగా ఉన్నప్పటికీ ఆ గ్రామ ప్రజలందరూ చేవెళ్లలోనే నివాసం ఉంటున్నారన్నారు. ఇప్పుడు మున్సిపాలిటీలో కూడా చేవెళ్లతోనే తమ వార్డును కొనసాగించాలని కోరారు. కొత్త వార్డులో కలిసే ఓట్లతో ఇబ్బందులు ఏర్పడుతాయన్నారు. దీనిపై ఎమ్మెల్యే సానుకులంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో కేసారంకు చెందిన ప్రజలు, నాయకులు, తదితరులు ఉన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం


షాబాద్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

షాబాద్: బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ముదిరాజ్ భవన్‌లో మండల పార్టీ అధ్యక్షుడు మద్దూరు మాణెయ్య ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఏర్పడి 11 సంవత్సరాలు ముగిసిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో కమల వికాసమే లక్ష్యంగా పని చేద్దామన్నారు. ఈ నెల 21న యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుందామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పీసరి సతీశ్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు కిరణ్, రవీందర్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి కూతురు మహేందర్, ప్రధాన కార్యదర్శి హరీశ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు మహేశ్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు మహేందర్, నాయకులు తదితరులు ఉన్నారు.

రోటావేటర్‌లో ఇరుక్కుని బాలిక మృతి


ప్రమాద స్థలంలో రోదిస్తున్న కుటుంబసభ్యులు

చేవెళ్ల: రోటావేటర్ ఓ బాలిక ప్రాణం తీసింది. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చేవెళ్ల మండలం తంగడపల్లి సమీపంలోని ఫామ్‌హౌస్‌లో కర్ణాటకకు చెందిన సుశీల్‌కుమార్, పద్మ దంపతులు పనిచేస్తూ అక్కడే ఉంటున్నారు. పద్మ చెల్లెలు కళావతి, సంజీవ్‌కుమార్ కుటుంబం వికారాబాద్‌జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌లో ఉంటోంది. అక్కను చూసేందుకు కళావతి భర్త, పిల్లలతో కలిసి మంగళవారం తంగడపల్లిలోని తోటకు వచ్చారు. బుధవారం మధ్యాహ్నం మామిడి తోటలో సుశీల్‌కుమార్ ట్రాక్టర్ రోటావేటర్‌తో దున్నతున్నాడు. అదే సమయంలో కళావతి కూతురు అక్షిత (11) ఆడుకుంటూ వచ్చింది. ప్రమాదవశాత్తు రోటావేటర్‌లో ఇరుక్కొని తీవ్రంగా గాయపడింది. వెంటనే కుటుంబసభ్యులు గమనించి చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే బాలిక మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సంజీవ్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో బాలుడి మృతి

- సేడం సమీపంలో రైలు పట్టాలపై మృతదేహం
- బషీరాబాద్ మండలం మైల్వార్‌లో విషాద ఛాయలు


శాంతుకుమార్(ఫైల్)


రైలు పట్టాలపై శాంతుకుమార్ మృతదేహం

బషీరాబాద్: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ బాలుడు తెల్లారేసరికి రైలు పట్టాలపై శవమై కనిపించాడు. ఈ ఘటన కర్ణాటక రాష్ట్రం సేడం రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం వెలుగు చూసింది. బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, కర్ణాటక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బషీరాబాద్ మండలం మైల్వార్‌కు చెందిన అంజిలమ్మ, మున్నెప్ప దంపతుల కొడుకు శాంతుకుమార్ మంగళవారం రాత్రి తన స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలో పాల్గొనేందుకు కంసాన్‌పల్లి వెళ్లాడు. తిరిగి 10.30 గంటలకు ఇంటికి చేరుకున్నాడు. అంతలోనే ఓ నంబర్ నుంచి అతని సెల్ ఫోన్‌కు కాల్ వచ్చినట్లు కుటుంబీకులు గుర్తించారు. దీంతో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బైక్ తీసుకుని తన అమ్మమ్మ గ్రామమైన కర్ణాటక రాష్ట్రం ముదినకు బయలుదేరాడు. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదు కానీ ఉదయాన్నే సేడం రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలపై విగతజీవిగా పడి ఉన్నాడు. పోలీసుల సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని బోరున రోదించారు.

ప్రేమ వ్యవహారమే ప్రాణం తీసిందా..?

శాంతుకుమార్ ఇటీవలే పదో తరగతి పూర్తి చేశాడు. పరీక్షల్లో ఫెయిల్ కావడంతో ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటున్నాడు. ఇతనికి అమ్మమ్మ గ్రామమైన ముదినకు చెందిన ఓ అమ్మాయితో ప్రేమ వ్యవహారం ఉందని తెలుస్తోంది. ఆమె ఫోన్ చేయడంతోనే మంగళవారం రాత్రి బైక్ తీసుకుని బయటకు వెళ్లినట్లు బాలుడి సన్నిహితులు తెలిపారు. అయితే ఆతర్వాత బాలుడు ఎక్కడికి వెళ్లాడు.. ఎవరితో మాట్లాడాడు..? అనేది పోలీసులు తేల్చాల్సి ఉంది. ఇదిలా ఉండగా తమ కొడుకును రైలు ఢీకొని ఉంటే తీవ్రమైన గాయాలు కావాలని, స్వల్పగాయాలతో ఎలా మరణిస్తాడని తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎవరో హత్య చేసి పట్టాలమీద పడేశారని, బైక్ కూడా ఎత్తుకెళ్లారని సేడం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గుల్బర్గా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాలుడి మృతితో మైల్వార్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

అక్కసుతోనే దాడులు


గోవింద్‌నాయక్

పరిగి: ఏపీలో కొనసాగుతున్న అక్రమ అరెస్టులు, జర్నలిస్టులు, పత్రిక కార్యాలయాలపై దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని ఎల్‌హెచ్‌పీఎస్, భారత్ ముక్తి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవింగ్‌నాయక్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాస్‌రావుపై అక్రమంగా కేసులు పెట్టి జైలుకు పంపడం అప్రజాస్వామికమని తెలిపారు. ఏపీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న గొంతులను నొక్కే ప్రయత్నం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది కాలంగా ఏపీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను బయటపెడుతోందనే అక్కసుతో సాక్షి కార్యాలయాలపై దాడులు చేస్తున్నారన్నారు. ప్రత్రిక స్వేచ్ఛను హరించే కుట్ర చేస్తున్న వారికి వ్యతిరేకంగా పోరాడేందుకు తాము సిద్ధమని ప్రకటించారు.

దైవ దర్శనానికి వెళ్తూ మృత్యు ఒడికి

- కారును ఢీకొట్టిన డీసీఎం
- వ్యక్తి మృతి, మహిళకు గాయాలు


నుజ్జునుజ్జయిన కారు

బొంరాస్‌పేట: ఎదురుగా వచ్చిన డీసీఎం కారును ఢీకొట్టిన సంఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. మండల పరిధిలోని జాతీయ రహదారి 163పై మంగళవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ రవూఫ్ వివరాల మేరకు.. హైదరాబాద్‌లో వ్యాపారం చేస్తున్న బీజాపూర్ వాసి కంచి వెంకటేశ్వర్‌రావు(48), భార్య కళ్యాణితో కలిసి కారులో తన కారులో కర్ణాటకలోని గానుగాపూర్ దత్తత్రే స్వామి దర్శనానికి వెళ్తున్నారు. ఈక్రమంలో బీజాపూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న డీసీఎం భోజన్న గడ్డతండా గేటు వద్ద వీరి కారును ఢీకొంది. దీంతో కారు నడుపుతున్న వెంకటేశ్వర్‌రావు అక్కడికక్కడే మృతి చెందగా కళ్యాణికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆమెను మొదట పరిగి ఆస్పత్రికి ఆతర్వాత హైదరాబాద్ తరలించారు. డీసీఎం డ్రైవర్ జానప్పపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

పరువు పోతుందనే హత్యకు పథకం

- వరుసకు బావ అయ్యే వ్యక్తిపై యువకుడి హత్యాయత్నం
- కత్తి, ఇనుప రాడ్లతో విచక్షణా రహితంగా దాడి
- రాపోల్ ఘటన వివరాలను వెల్లడించిన డీఎస్పీ శ్రీనివాస్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్

పరిగి: మండల పరిధిలోని రాపోల్‌లో మంగళవారం రాత్రి జరిగిన వృద్ధురాలి హత్య, ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై హత్యాయత్నం ఘటనకు సంబంధించిన వివరాలను పరిగి డీఎస్పీ శ్రీనివాస్ బుధవారం మీడియాకు వెల్లడించారు. గ్రామానికి చెందిన పాట్టి రాంచరణ్ ఇంటర్ ఫెయిలై జులాయిగా తిరుగుతున్నాడు. ఈక్రమంలో ఖర్చుల కోసం వరసకు బావ అయ్యే రాజేందర్ ఇంట్లో తరచూ డబ్బులు దొంగిలించేవాడు. గత మంగళవారం రాత్రి సైతం రాజేందర్(ప్రభుత్వ ఉపాధ్యాయుడు) ఇంట్లో చోరీకి వెళ్లాడు. ఇది గమనించిన అతను అరవడంతో రాంచరణ్ పారిపోయాడు. ఈ విషయాన్ని తన స్నేహితులైన చంద్రశేఖర్(బన్ని)తో పాటు మరో యువకుడికి చెప్పాడు. తాను చోరీకి వెళ్లిన విషయాన్ని ఉదయాన్నే గ్రామంలో అందరికీ చెప్పి, తన పరువు తీస్తాడని భావించి, అతన్ని చంపేద్దామన్నాడు. ఇందుకు స్నేహితులు సైతం వంతపాడారు. ఆవెంటనే రాంచరణ్ తన ఇంటికి వెళ్లి కత్తి తీసుకుని, రాజేందర్ ఇంటికి చేరుకున్నారు. అతను నిద్రలో ఉండగా కత్తి, ఇనుప రాడ్డుతో రాంచరణ్ దాడి చేశాడు. మేల్కొన్న రాజేందర్ పెద్దగా అరవడంతో పక్క గదిలో పడుకున్న అతని తల్లి నర్సమ్మ వచ్చి, అడ్డుకుంది. దీంతో ఆమెను సైతం కత్తితో పొడిచి, బండరాయితో దాడి చేయగా అక్కడికక్కడే మృతిచెందింది. ఈ అలికిడికి చుట్టు పక్కల వాళ్లు లేవడంతో పారిపోయారు. దాడికి ఉపయోగించిన కత్తి, రాయి, ఇనుప రాడ్లను బావిలో పడేసేందుకు ప్రయత్నించగా.. కత్తి ఒడ్డుపైనే పడింది. రాంచరణ్, చంద్రశేఖర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని రిమాండ్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్ఐ సంతోష్‌కుమార్ పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మృత్యువుతో పోరాటం..

దాదాపుగా 30కి పైగా కత్తి పోట్లతో తీవ్రంగా గాయపడిన రాజేందర్ గాంధీ ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతున్నాడు. కత్తితో దాడి చేసిన సమయంలో కొంత భాగం తలలో విరిగిపోయింది. ఆపరేషన్ ద్వారా కత్తి ముక్కను తొలగించినట్లు తెలిసింది. దాడిలో మృతిచెంది రాజేందర్ తల్లి నర్సమ్మ అంత్యక్రియలను బుధవారం పూర్తి చేశారు. కొడుకు లేకపోవడంతో భర్త చెన్నయ్య అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

విత్తనశుద్ధితో తెగుళ్లకు అడ్డుకట్ట

ధారూరు: పంటలో వచ్చే తెగుళ్ల నివారణకు విత్తన శుద్ధి చేసుకోవాలని రాజేంద్రనగర్‌లోని నూనె గింజల పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ అలివేలు రైతులకు సూచించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ ఉషాకిరణ్, డాక్టర్ శంకర్‌మీనా, డాక్టర్ పుష్పలతో ఆమె మండలంలోని గురుదోట్ల, అంపల్లి గ్రామాల్లో బుధవారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేప గింజలతో తయారు చేసిన పిండి, రైజోబియంను భూమిలో కలపడంతో భూసారం పెరిగి దిగుబడి బాగా వస్తుందన్నారు. శాస్త్రవేత్తలు పుష్ప, ఉషాకిరణ్, మీనలు మాట్లాడుతూ.. ఆముదం పంటపై రెండుసార్లు పాక్లోబ్యూటజోల్ మందును పంటపై పిచికారీ చేస్తే ఎత్తు తగ్గి దిగుబడి పెరిగి పంటకాలం తొందరగా వస్తుందని అన్నారు. కార్యక్రమంలో పరిశోధన సంస్థకు చెందిన ఝాన్సీ, పూజిత, తేజస్వీ తదితరులు పాల్గొన్నారు.

చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య

అబ్దుల్లాపూర్‌మెట్ : చెట్టుకు ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఅంబర్‌పేట ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలోని బలిజగూడ రహదారిలో ఉన్న ఏఎల్ నగర్ వెంచర్‌లో బుధవారం ఓ వ్యక్తి చెట్టుకు ఉరివేసుకున్నాడు. సమాచారం అందుకున్న అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడు వనస్థలిపురానికి చెందిన మనోహర్ రెడ్డిగా గుర్తించారు. కేసు నమోదు చేసుకుని పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

టీ కాస్తుండగా మంటలు అంటుకుని...

రహమత్‌నగర్: టీ కాచే క్రమంలో ఓ విద్యార్థినికి మంటలు అంటుకుని తీవ్రంగా గాయపడిన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... ఎస్పీఆర్ హిల్స్ ప్రాంతానికి మైనర్ బాలిక ఓ గురుకుల ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతి చదువుతోంది. సెలవులకు ఇంటికి వచ్చింది. ఈ క్రమంలో ఆ విద్యార్థిని ఈ నెల 9వ తేదీన మధ్యాహ్నం ఇంట్లో టీ కాచేందుకు వంట గదిలోకి వెళ్లి టీ పెట్టింది. టీ గిన్నెను దించేందుకు సమీపంలో ఏమీ కనిపించక పోవడంతో తాను వేసుకున్న పంజాబీ డ్రెస్‌ను ఉపయోగించింది. అయితే, డ్రెస్‌కు మంటలు అంటుకోవడంతో అరుస్తూ బయటికి పరుగులు తీసింది. పొరుగు వారు వచ్చి మంటలార్పి విద్యార్థిని తల్లికి సమాచారం అందించి సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తుంది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్: వేగంగా వస్తున్న రైలుకు ఎదురెళ్లి ఓ వ్యక్తి సికింద్రాబాద్ రైల్వే పీఎస్ పరిధిలో ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ డేవిడ్‌రాజు వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్‌కు చెందిన నీరుడు నర్సింగ్‌రావు(36) బుధవారం మధ్యాహ్నం ఘట్‌కేసర్ అప్ లైన్ రైల్వేట్రాక్ వద్దకు చేరుకున్నాడు. రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు.

బీసీ హక్కుల కోసం నిరంతర పోరాటం


కమిటీని సన్మానిస్తున్న బర్క కృష్ణయాదవ్

బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణాయాదవ్

షాబాద్: బీసీల హక్కుల కోసం నిరంతర పోరాటం చేస్తామని బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణయాదవ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం బీసీసేన మండల సమావేశం నిర్వహించారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీసీసేన మండల అధ్యక్షుడిగా దామర్లపల్లి గ్రామానికి చెందిన కమ్మరి దయాకర్‌చారిని నియమించారు. ఉపాధ్యక్షుడిగా గోపాల్, యూత్ అధ్యక్షుడిగా బండ అజయ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణాయాదవ్ మాట్లాడుతూ.. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలంతా పోటీకి సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బీసీసేన జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, షాద్‌నగర్ నియోజకవర్గం అధ్యక్షుడు కత్తి శేఖరప్ప, మహిళా అధ్యక్షురాలు బాస వరలక్ష్మి, ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు మేకల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

బంజారాహిల్స్‌లో వ్యభిచారం గృహంపై దాడి


అరెస్టయిన వ్యభిచార గృహం నిర్వాహకులు, కస్టమర్లు, హౌస్‌కీపింగ్ సిబ్బంది

బంజారాహిల్స్: బంజారాహిల్స్ పోలీసులతో కలిసి వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ బృందం వ్యభిచారం గృహంపై దాడి చేసి నిర్వాహకుడితో పాటు ఇద్దరు హౌస్ కీపింగ్ సిబ్బంది, ముగ్గురు కస్టమర్లను అరెస్టు చేశారు. మరో నలుగురు మహిళలను రిహాబిలిటేషన్ సెంటర్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలప్రకారం... బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు బంజారాహిల్స్ పోలీసులతో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వ్యభిచార గృహం నిర్వాహకుడు అనంతపురం జిల్లా కేశవరాయనిపేటకు చెందిన కుమ్మెత నరేందర్‌రెడ్డి, హౌస్ కీపింగ్ విధులు నిర్వర్తించే బీహార్‌లోని ముజఫర్‌పూర్ ప్రాంతానికి చెందిన ఆనంద్‌కుమార్, రాహుల్‌కుమార్‌లతో పాటు ముగ్గురు కస్టమర్లను పోలీసులు అరెస్టు చేశారు. అలాగే నలుగురు మహిళలను రిహాబిలిటేషన్ సెంటర్‌కు తరలించారు. వీరి నుంచి రూ.26,500 నగదు, ఏడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుమార్తె, మనవరాళ్లు కనిపించడం లేదంటూ మహిళ ఫిర్యాదు

వెంగళరావునగర్: తన కుమార్తె, మనవరాళ్లు కనిపించడం లేదంటూ ఓ మహిళ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం..కె.రమణ, భిక్షపతి దంపతులు రహమత్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. వారి కుమార్తె శిరీషకు 2012లో శివ అనే యువకుడితో వివాహం జరిపించారు. వారికి ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు. పెళ్లయిన నాటి నుంచి శిరీషను భర్త ఏదోరకంగా హింసిస్తున్నాడు. దాంతో గత ఏడు నెలలగా శిరీష తన ఇద్దరు కుమార్తెలతో కలిసి తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. ఈ నెల 6వ తేదీ శిరీష తన కుమార్తె ఆధార్ కార్డులో మార్పులు చేయిస్తానని ఇంటి నుంచి వెళ్లింది. సాయంత్రం వరకూ రాలేదు. ఫోన్ చేస్తే వస్తున్నానని చెప్పిందేగాని రాలేదు. మరుసటి రోజు తల్లిదండ్రులకు ఫోన్ చేసి తన పిల్లలను హాస్టల్‌లో చేర్పించి, తాను జాబ్ చూసుకుంటానని చెప్పింది. అయితే నాటి నుంచి ఎన్నిమార్లు ఫోన్లు చేసినా సమాధానం లేదు. ఇంటికి రాలేదు. ఆందోళన చెందిన శిరీష తల్లి రమణ బుధవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరియా ఫీడ్ కంపెనీకి సీల్


మరియాఫీడ్ కంపెనీకి సీల్ వేసిన తహసీల్దార్ సాజిదాబేగం

ధారూరు: మండల పరిధిలోని దోర్నాల్ గ్రామ సమీప 113 సర్వేనంబర్‌లో ఉన్న మరియా ఫీడ్ కంపెనీకి తహసీల్దార్ సాజిదాబేగం బుధవారం తాళం, సీల్ వేశారు. కంపెనీ నుంచి దుర్వాసన వస్తోందని, ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని మంగళవారం రాత్రి గ్రామస్తులు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. దీంతో ఆర్డీఓ వాసుచంద్ర, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి ఆందోళనకారులను శాంతింపజేశారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారుల నివేదిక వచ్చే వరకు కంపెనీని మూసేస్తున్నామని తహసీల్దార్ తెలిపారు. అప్పటి వరకు ఫ్యాక్టరీలోకి వాహనాలు రాకుండా రోడ్డుకు అడ్డంగా ట్రెంచ్ తవ్వించామన్నారు. ఆమె వెంట డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, ఏఎస్ఐ సంగమేశ్వర్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

యువకుడి ప్రాణం తీసిన ట్రక్కు


మృతుడు ప్రమోద్‌కుమార్ ఫైల్

షాబాద్: ట్రక్కు దూసుకెళ్లడంతో ఓ యువకుడు మృతిచెందిన సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ సతీశ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చందనవెళ్లి కుందానా కంపెనీలో వలస కార్మికుడిగా పనిచేస్తున్న ప్రమోద్‌కుమార్ (35) బుధవారం వాష్‌రూమ్‌కు వెళ్తున్నాడు. అదే సమయంలో అక్కడే కంటైనర్‌లను లిఫ్ట్ చేసే ట్రక్కు డ్రైవర్ అజాగ్రత్తగా వాహనం నడపడంతో అదుపుతప్పి ప్రమోద్‌కుమార్‌పై నుంచి వెళ్లింది. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం అతడిని శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టీటీడీ ఆలయం హుండీలో చోరీ.. పోలీసులకు ఫిర్యాదు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్‌లోని టీటీడీ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీలో నగదు దొంగలిస్తుండగా భక్తులు వారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని ఆలయ వర్గాలకు అప్పగించారు. అయితే మైనర్ బాలుర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆలయ వర్గాలు వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి చోరీ చేసిన నగదును తిరిగి హుండీలో వేయించి పంపించారు. అయితే కొద్ది రోజుల తర్వాత అందులో ఓ బాలుడు మళ్లీ ఆలయానికి వచ్చి అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఆలయ ఏఈఓ రమేష్ ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత నెల 28న ఓ బాలుడు సన్నిధిలో ఉన్న హుండీలో నుంచి డబ్బులు తీస్తుండగా భక్తులు గమనించి తమకు అప్పగించారని, ఆ కొద్ది దూరంలోనే తమ విజిలెన్స్ సిబ్బంది మరో బాలుడిని పట్టుకోవడం జరిగిందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నారు.